# ఏక్‌సె బఢ్‌కర్ ఏక్

మొవ్వ బాబూరావు




చిక్కడపల్లి..

రాజధానిలోని రద్దీ ప్రాంతపు కూడలి.

సినిమా టాకీసులు మీ ఇష్టం వచ్చిన చోట్లలో కట్టుకోకుండా మాంచి సెంటర్స్‌లో కట్టుకుంటేనే మేం పర్మిషన్ ఇస్తామని అన్నారేమో ప్రభుత్వం వారు — నగరపు నడిబొడ్డున నలువైపులా నలభై థియేటర్లు.

ముచ్చటగా మూడు గంటల దాక సినీ ప్రేక్షకుల్ని తమ తమ కడుపుల్లో దాచుకున్న థియేటర్లు అప్పుడే ప్రసవించి నట్లున్నాయి.

అది జన సందోహం కాదు — జన ప్రవాహం. చీమల పుట్టల్లో నుంచి వస్తున్న చీమల్లా బారులు తీరి ఉన్న జనం. ఎట్నించి ఎటు పోతున్నారో, అసలు ఎక్కడికి వెళ్లాలో వాళ్ళకి తెలుస్తోందా! అన్నట్లుంది ఆ ప్రవాహం.

దేశానికి కావాల్సింది అణ్వస్త్రాలు కావు, అన్నవస్త్రాలని అన్నారు ఆయనెవరో ప్రముఖుడు.

నిదానంగా ఆలోచిస్తే అది కూడా పొరబాటే. మన ఇప్పటి ప్రజలకు కావల్సింది అన్నవస్త్రాలు కూడా కాదు, అంగవస్త్రాలతో నటిస్తున్న వెండితెర నటీనటుల సినిమాలు. అవి చూస్తే చాలు - మరేం అక్కర్లేదు.

తమ జీవితాలలో ఎలాను లేవు రంగులు. కనీసం సినిమాల్లోనైనా ఆ రంగులు తనివి తీరా చూడచ్చు అన్న ఆశ.

సినిమా హాళ్ళు వాళ్ళ దృష్టిలో దేవేంద్ర భవనాలు.

సినిమా తారలే వాళ దృష్టిలో దేవుళ్లూ — దేవతలు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ట్రాఫిక్కుని కంట్రోల్లో పెట్టలేకపోతున్నాడు

దిక్కుచిలా పని చేసే ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయటం ఆగిపోయాయి.

చేతులు ఏటువైపు సాచాలో అర్థం కావటంలేదు ఇన్‌స్పెక్టరికి.

కమాండర్ ఆర్డర్ ఇచ్చిన మిలటరీలా ట్రాఫిక్ ఆ రద్దీ ప్రాంతం నుంచి తప్పించు కోవటానికి ఓ నియమం, నిబంధన లేకుండా ఒక బండికీ ఒక బండీ తోసుకుంటూ, ఒకర్ని ఒకరు ఏదుర్కొంటూ, ఢీ కొడుతూ, గంటలు, హారన్లు మ్రోగిస్తూ, చిందర వందరగా, ఆదరా బాదరగా కుమ్ముకుంటూ, కొట్టుకుంటూ అమ్మవారి జాతరలా కడు రమ్యాతి రమ్యంగా ఉంది ఆ దృశ్యం.

ఇంతలో ఓ ప్రక్కన —

స్కూటర్ మహానుభావుడు అనే వేంగిలో తప్పించుకు పోతున్న ఓ నల్ల కారుకు ఢీ కొట్టాడు.

కారు వాడు ఇదేమి పట్టించుకోకుండా ముందుకు పోబోయాడు. స్కూటర్ ముందు భాగం సొట్టపోయింది.

తప్పించుకు పోబోతున్న కారుని జనం దిలాగైతే పట్టుకున్నారు అప్పుడే చూసొచ్చిన తెలుగు సినిమాలో హీరో గుర్తుకు వచ్చాడేమో వాళ్ళకి, బలవంతంగా కారులో ఉన్న పెద్ద మనిషిని క్రిందకి దింపారు. అంతే - స్కూటర్ నడిపిన పెద్దమనిషి స్కూటర్ దిగి కారు పెద్దమనిషిని చితకబాదాడు. అంతే ఒకటి, రెండు, మూడు ..ఎవరికి చేతనైన సహాయం వాళ్ళు చేసారు. కుయ్ కుయ్ మనకుండా అలా దెబ్బలు తింటూనే ఉన్నాడు కారు మనిషి

'మీరా' ప్రియతరచయిత్రి
లక్ష్మి
ప్రైజ్ కొట్టిన నవల



ప్రేమమందిరం
(రూ.12/-)
వెలువడింది!
10 రూ. M.O. చేస్తే 2 రూ.లకే
V.P. పెట్టి పంపిస్తాము
ఆంధ్రప్రదేశ్ బుక్
డిస్ట్రిబ్యూటర్స్
3237, రాష్ట్రపతిరోడ్,
సికింద్రాబాద్-
500003.

# ఏక్ సె బఢ్ కర్ ఏక్

కసరత్తు చేసిన మనిషిలా ఉన్నాడు కాబట్టి ఆ దెబ్బలకు నిభాయించుకోగలిగాడు, మరొకడైతే ప్రియా పచ్చడై పోయేవాడు. స్కూటర్ వాడికి ధైర్యం మరింత హెచ్చింది.

పబ్లిక్ పబ్లిక్‌గా అతనికి సహాయం చేస్తోంది. అతని సమర్థిస్తోంది. అతనితో పాటు నాలుగు దెబ్బలు వాళ్ళూ వేస్తూనే వున్నారు.

ఎవరిది రాంగ్ సైడో అసలు ఎవరికీ తెలీదు.

స్కూటర్కి చిన్న చిన్న గాయాలు తగిలాయి కాబట్టి తప్పంతా కారుదే అని ఏకగ్రీవంగా తేల్చారు. అంతే...

స్కూటర్ పెద్దమనిషి మెదడు పదునుగా పనిచేస్తోంది.

"కొత్త బండి, మొన్ననే బ్లాక్‌లో కొన్నాను. ఇప్పుడు చూడు నువ్వు చేసిన ఘనకార్యానికి ఎలా తయారయిందో! దీన్ని నువ్వు ఇప్పుడు బాగుచేయించావా సరే, లేకపోతే నువ్వూ నీ కారూ ఇక్కడ్నించి కదల్లేయ్యను..." స్కూటర్కి ఉన్న పాతగాయాల్నికూడా కొత్త లెక్కల్లో చూపించేసాడు.

'అవును వదలద్దు... బాగుచేయించమనండి...' జనం ఏకగ్రీవంగా గోల పెడుతున్నారు.

కారు సర్దార్జీ స్కూటర్ మార్వాడీ ఆక్రమానికి ఒప్పుకుంది చేసేదేమీ లేక.

జనం క్షణక్షణానికి ఆవేశపూరితులవుతున్నారు.

ప్రక్కనే ఉన్న మోటార్ రిపేర్ షాపులో ఉన్న కుర్రాణ్ని పిలిచి స్కూటర్ని బాగుచేయమన్నాడు.

కుర్రాడు ఆశ్చర్యపోయాడు. దీనికోసమా ఇంతమంది కలిసి పాపం సర్దార్జీని తెగ బాదారు. అవి మైనర్ రిపేర్స్. పైగా చిన్నప్పట్నించో ఉన్నవిలా ఉన్నాయి. కొత్తగా తగిలిన గాయాలు ఏవీ లేనట్టున్నాయి. మార్వాడీ గోల్డెన్ బుర్రని మెచ్చుకోక తప్పింది కాదు.

ఐదు రూపాయల కూలీతో అయ్యేపనిని, పరిస్థితిని, పరిసరాలను బట్టి పాతిక రూపాయలు వసూలు చేసింది ఆ చిన్నాడి సిల్వర్ బుర్ర.

ఎలాగైతే స్కూటర్ బాగుపడింది.

## గురుకులాలు-కులగురువులు

అలనాటి
గురుకులాల
గురువులు
ఈనాటి
విద్యాలయాల
కులగురువులు !
కులాలు నిలిస్తే
యూనివర్సిటీలు
టంకశాలలైతే —
కులాల వారి
కాలేజీల్లో
వల్లధనమున్న
బుర్రోళ్ళకు
చెల్లని నాణాలే
పంతులు !

— పిప్పళ్ల సూర్యప్రకాశరావు

బాగుపడటానికి అసలు అక్కడ అయిందేముంది ? చేసిందేముంది ?

క్లచ్ ఒక్కసారి నొక్కి సరిగ్గా ఉందో లేదో చూసుకోమన్నాడు సర్దార్జీ!

అతని అమాయకత్వానికి లోలోపలే నవ్వుకున్నాడు మార్వాడీ మహారాజా.

చిన్నప్పట్నించో బాగుచేయిద్దామన్న ఆ రిపేర్లు బాగుపడ్డాయి. తన తెలివితేటలకు తనే మురిసిపోయాడు.

సర్దార్జీ పాతిక రూపాయలు జేబులోనుంచి తీసి స్కూటర్ రిపేర్ చేసిన కుర్రాడికి ఇచ్చాడు.

తన పని తను నిర్విఘ్నంగా జరుపుకున్నట్టు, స్కూటర్ స్టార్ట్ చేసాడు గర్వంగా మార్వాడీ.

ఇంతలో సర్దార్జీ అతి మామూలుగా స్కూటర్ పెద్దమనిషి చేయిపట్టుకున్నాడు.

ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసాడు.

చెల్లాచెదురైపోతున్న జనం మళ్లీ ఏం జరగబోతుందనో ఆసక్తితో ముందుకు వేసిన రెండడుగుల్ని వెనక్కి తీసారు.

"భాయీ! నీ స్కూటరు బాగుపడి నట్టేనా?"

"బిల్‌కుల్" అన్నాడు స్కూటర్ భాయి గర్వంగా.

'దాన్ని బాగుచేయించిందెవరు ?'

'మన్నే!' అన్నాడు. ఇంకెవరుచేయిస్తారు మరి? అన్నట్టుంది అతని జవాబు.

కొంపదీసి కారు కూడా ఏదైనా రిపేరు కొచ్చిందా ఏం ఖర్మ! అనుకున్నాడు.

అదృష్టం కొద్దీ అలాంటిదేమీ లేనట్టుంది.

అప్పటికే అక్కడి జనంలో ఓ పదిమంది దాకా సర్దార్‌జీలు ఎక్కడ్నుంచి వచ్చారో! కారు సర్దార్‌జీ వెనుక చేరి 'క్యాహువా భాయి బోలో' ధైర్యం చెప్పారు.

"దేఖో భయి! నీ స్కూటర్‌కి దెబ్బలు తగిలాయి. నా తప్పని అందరూ అన్నారు. దానిని అందరి ముందు రిపేర్ చేయించాను. ఈ యాక్సిడెంట్ ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో, అసలు ఎవరిది తప్పో ఎవరికీ తెలియదు. కాని తప్పు నాదేనని అందరూ కలిసి నన్ను కొట్టారు" అంటూ నుదుటిమీద అదిమి పెట్టి ఉన్న చేతిని నెమ్మదిగా తీసాడు. రక్తం కారుతోంది.

అది చూసి మిగిలిన సోదర సర్దార్‌జీలు ఆవేశపూరితు లయ్యారు.

మార్వాడి వైపు ఒక అడుగు ముందుకు వేసారు.

బలవంతం మీద కారు సర్దార్‌జీ వాళ్ళని ఆపగలిగాడు.

"చూడు బ్రదర్! నా ఈ గాయం మాయాలంటే ఆస్పత్రిలో నేను అడ్మిట్ అవాలి కనీసం కొన్ని వందలైనా ఖర్చు అవుతుంది. ఓ రెండొందలు నాకిచ్చి నువ్వూ, నీ స్కూటర్ నిరభ్యంతరంగా ఇక్కణ్నించి వెళ్ళచ్చు" తాపీగా చెప్పి స్కూటర్ హేండిల్‌ని బలంగా పట్టుకున్నాడు.

'పిచ్చిగాని ఎక్కలేదు కదా' అన్నాడు స్కూటర్ బాబ్జి.

జనం విస్తుపోయి చూస్తున్నారు.

'పిచ్చి పిచ్చిగా వాగకు, నీ స్కూటర్ని నేను బాగు చేయించాను. నాకు మీ రందరూ ప్రసాదించిన ఈ గాయాన్ని మీరే బాగుపడే టట్టు చేయించండి. లేకపోతే నే నడిగిన రెండొందలు మర్యాదగా ఇయ్యి.'

సర్దార్‌జీ చెయ్యి స్కూటర్ మనిషి కాలర్ దాకా వెళ్ళింది.

అనుకోని ఈ సంఘటనకు విర్భాంత పోయాడు స్కూటర్ భాయి.

చుట్టూ వింత చూస్తున్న జనం పరిస్థితీ అలానే ఉంది.

అప్పుడే అటుగా వచ్చిన పోలీసు కూడా పరిస్థితిని అర్థం చేసుకుని సర్దార్‌జీనే సమర్థించాడు.

పరిస్థితి తారుమారయింది.

ఇంకా కాస్సేపుంటే ఏమవుతుందో?

'నా దగ్గర డబ్బు లేదు' అమాయకంగా అన్నాడు స్కూటర్ బాబ్జి.

'అడగవయ్యా! ఇందాక నన్ను కొట్టటానికి సహాయం చేసిందిగా ఈ జనం! ఇప్పుడు కూడా అడుగు డబ్బు ఏదైనా సహాయం చేస్తారేమో' సర్దార్‌జీ గర్జించాడు. నుదుటి మీద నుంచి రక్తం కారుతూనే ఉంది.

ఇంకో రెండు నిమిషాలలో కర్ఫ్యూ విధిస్తారేమో అన్నట్టుంది పరిస్థితి. జనం నెమ్మది నెమ్మదిగా జారుకుంటున్నారు. తెలుగు సినిమాలోని హీరో ఇప్పుడు గుర్తుకు రావటంలేదు.

గుమిగూడిన జనం అంతా ఓ నిమిషంలో మంత్రం వేసినట్టు మాయమయి పోయారు.

స్కూటర్ మనిషి పోలీసు వంక సాధేయ పూర్వకంగా, ఆశగా చూస్తున్నాడు 'మన్నైనా నన్ను కాపాడలేవా' అన్నట్టు.

అవతల సర్దార్‌జీలంతా తన వంక క్రూరంగా చూస్తున్నారు. జేబులో రెండు వదులు తప్ప మరేం లేదు.

సర్దార్‌జీ ఓ నిర్ణయానికి వచ్చినట్టున్నాడు. ఇంకేం అనదలచుకోలేదు. తన చేతిలోనే ఇరుక్కుపోయిన బాబ్జిగారి వేలి ఉంగరాన్ని బలంగా ఊడబెరికాడు. 'ఇదిగో నా అడ్రస్, రెండొందలు తెచ్చి ఇస్తే నీ ఉంగరం నీకు దక్కుతుంది. లేదా అంతే' అంటూ తాపీగా కారు వైపు నడిచాడు తోటి మిత్రులకు కృతజ్ఞతలు చెబుతూ.

గుడ్లప్పగిస్తూ అలానే చూస్తుండి పోయాడు డిగ్రేట్.

ఇందులో తను జోక్యం కలగ చేసుకోటానికి ఏమీ లేదనుకుంటూ నెమ్మదిగా జారుకున్నాడు రక్షక భటుడు.

'నుదుట మీద కురుపు తనకి ఎంత సహాయం చేసిందో' అని ఉప్పొంగి పోయాడు సర్దార్‌జీ, సరి అయిన టైంలో తనకొచ్చిన తెలివితేటల్ని మెచ్చుకుంటూ.

స్కూటర్ బాబ్జి గోల్డెన్ బుర్రని మెచ్చుకున్న రిపేర్ చేసిన కుర్రాడి సిక్కో బుర్ర, సర్దార్‌జీ ప్లాటినం బుర్రకి జోహారు అర్పించింది.

